రూ.6 కోట్ల భవనం.. పదేళ్లకే శిథిలం



ముడసర్లోవ జంక్షన్ వద్ద పాత స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ భవనం

- ముడసర్లోవ వద్ద పదేళ్ల క్రితం భవన నిర్మాణం
- ఎనిమిదేళ్ల పాటు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహణ
- గతేడాది ఖాళీ చేసి జీవీఎంసీకి అప్పగింత
- అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిన వైనం


పగిలిన కిటికీల అద్దాలు, పెంకులు

ఆరిలోవ: నిర్మాణం చేపట్టి పదేళ్లు గడవక ముందే జీవీఎంసీకి చెందిన ఓ భవనం శిథిలావస్థకు చేరింది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవంతి అస్తవ్యస్తంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ జంక్షన్ వద్ద సుమారు పదేళ్ల కిందట జీవీఎంసీ నిర్మించిన భవనం దుస్థితి ఇది.

ఇక్కడ బీఆర్‌టీఎస్ రహదారి పక్కన పచ్చని మామిడి, కొబ్బరి చెట్లతో ఉండే జీవీఎంసీకి చెందిన 2 ఎకరాల విస్తీర్ణంలో 2011లో అధికారులు జోనల్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదించారు. దీని కోసం రూ.6 కోట్ల నిధులు కేటాయించి ఆఘమేఘాలపై పనులు చేపట్టారు. 2013 నాటికి భవన నిర్మాణం పూర్తి చేశారు. మూడు అంతస్తుల్లో విశాలమైన గదులతో మంచి గాలి, వెలుతురు వచ్చేటట్లు నిర్మించారు. అధికారులు దీనిలోకి మధురవాడలోని జీవీఎంసీ జోన్–2 కార్యాలయాన్ని తరలించడానికి సన్నాహాలు చేశారు. అప్పట్లో ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో అధికారులు ఆ ప్రయత్నం విరమించుకున్నారు. దీంతో 2014లో కొద్ది రోజుల పాటు భవన ఆవరణాన్ని ప్రభుత్వ ఇసుక యార్డుగా మార్చేశారు.

2015లో ఈ భవనాన్ని హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహణ కోసం లీజుకు ఇచ్చేశారు. దీని ద్వారా నెలకు రూ.15 లక్షలు జీవీఎంసీకి హెచ్‌పీసీఎల్ అద్దె చెల్లించేది. రెండెకరాల స్థలంలో రూ.6 కోట్లతో నిర్మించిన ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు కాకుండా అద్దెకు ఇవ్వడంపై అప్పట్లో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు మాత్రం వారి పని వారు చేసుకుపోయారు. లీజు గడువు తీరిన తర్వాత హెచ్‌పీసీఎల్ యాజమాన్యం ఆ భవనాన్ని ఖాళీ చేసి జీవీఎంసీ అధికారులకు గతేడాది అప్పగించేసింది.

అంతా అస్తవ్యస్తం..

రూ.6 కోట్లతో నిర్మించిన ఈ భవనం పదేళ్లలోనే శిథిలావస్థకు చేరింది. గోడల పెచ్చులు, గచ్చులు ఊడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. శ్లాబ్‌కు అమర్చిన సీలింగ్ పైపులు కిందకు వేలాడుతున్నాయి. వర్షాలు పడుతున్నప్పుడు శ్లాబ్‌ల నుంచి గోడల ద్వారా నీరు గదుల్లోకి చేరి నిల్వ ఉండిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇందులో నీరు ఇప్పటికీ గచ్చుపై పల్లం ప్రాంతాల్లో ఉండిపోవం విశేషం. ఇలా భవనమంతా అస్తవ్యస్తంగా మారింది. విశాలమైన గదులే కదా అనుకొని లోపలకి వెళ్తే కిటికీల అద్దాల నుంచి పగిలిన గాజు పెంకులే దర్శనమిస్తాయి. గదుల్లో కాలు మోపలేని పరిస్థితి నెలకొంది. అద్దంలా తయారు చేసి హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి ఇచ్చిన ఈ భవనాన్ని తిరిగి వారు శిథిలావస్థకు చేర్చి జీవీఎంసీకి అప్పగించారు. అధ్వానంగా మారిన ఈ భవనాన్ని అధికారులు ఎలా తిరిగి స్వాధీనం చేసుకున్నారో అంటూ స్థానికుల నుంచి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


శిథిలమైన గచ్చు

నిర్లక్ష్యంగా వదిలేయడంపై జీవీఎంసీ కమిషనర్ ఆగ్రహం

భవనం వినియోగానికి పనికొచ్చేలా మరమ్మతులు చేపట్టి అప్పగించాల్సిన బాధ్యత హెచ్‌పీసీఎల్ యాజమాన్యానిదే. అయినప్పటికీ అధికారులు ఎందుకో వారిపై ఒత్తిడి చేయలేదు.

ఈ భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడం, నివాసాలకు దూరంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, పక్కనే మామిడి తోట ఉండటంతో రాత్రిళ్లు ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. దీంతో విశాలమైన ఈ భవనం గదుల్లో గంజాయి, మద్యపానం వంటివి జరుగుతున్నాయి. ఇక్కడ పోలీసులు నైట్ రౌండ్స్ వేస్తున్నప్పటికీ లోపల అసాంఘిక కార్యకలాపాలు గుట్టుగా సాగిపోతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ భవనానికి పూర్వ వైభవం తీసుకొచ్చి ఏదైనా ప్రభుత్వ కార్యాలయంగా వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

ఈ భవనం స్వాధీనం చేసుకుని సుమారు ఏడాది గడిచింది. వినియోగానికి పనికిరాని విధంగా ఉన్న ఈ భవంతికి మరమ్మతులు కూడా అధికారులు చేపట్టలేదు. ఏదైనా ప్రభుత్వ కార్యకలాపాలకు కూడా వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. మూడు రోజుల కిందట ఈ భవనాన్ని సందర్శించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ దీని పరిస్థితిని చూసి అవాక్కయ్యారు. రూ.కోట్ల జీవీఎంసీ నిధులు వెచ్చించి నిర్మించిన విశాల భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారంటూ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి లేఖ రాసి వెంటనే మరమ్మతులు చేపట్టే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


భవనం లోపల శ్లాబ్ నుంచి వేలాడుతున్న పైపులు


ఇటీవల కురిసిన వర్షాలకు గచ్చుపై నిల్వ ఉన్న నీరు

క్లుప్తంగా

ఏయూలో మెడికల్ క్యాంప్


మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు

మద్దిలపాలెం: వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే సందర్భంగా ఏయూ హ్యూమన్ జెనిటిక్, ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ అండ్ డైటెటిక్స్ విభాగాలు సంయుక్తంగా ఇండస్ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఏయూలో ఉచిత బోన్ డెన్సిటీ మెడికల్ క్యాంప్ నిర్వహించాయి. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు ప్రారంభించారు. ఇండస్ హాస్పిటల్ ఆర్థోపెడిషియన్ డాక్టర్ పడాల శ్రీకాంత్ వైద్య పరీక్షలు చేసి పలు సూచనలిచ్చారు. ఎముకల ఆరోగ్యానికి కాల్షియం స్థాయి ఎంతో ముఖ్యమన్నారు. ఆస్టియోపోరోసిస్ వ్యాధిపై అందరికీ అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా వీడియో క్లిపింగ్‌లతో పాటు పోస్టర్లు ప్రదర్శించారు. ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ విభాగం ఆధ్వర్యంలో ఫుడ్‌స్టాల్‌లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


ద్విచక్ర వాహన చోదకులను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బీచ్‌రోడ్డు: ట్రాఫిక్ నిబంధనలు పటిష్టంగా అమలు చేసేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం సిరిపురం సర్కిల్ వద్ద మూడో పట్టణ ట్రాఫిక్ సిబ్బంది ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేశారు. హెల్మెట్ ధారణ, లైసెన్స్ ఇతర పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ ధరించటంపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

మందుబాబుల ఆగడాలు


శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల గోడ వద్ద తాగి పడేసిన మద్యం సీసాలు

బీచ్‌రోడ్డు: చిన్నపిల్లలు చదువుకునే ప్రాథమిక పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. పాఠశాల ప్రహరీ గోడ వద్ద మద్యం తాగి సీసాలను పడేస్తున్నారు. సాక్ష్యాత్తు రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత ఇంటికి సమీపంలోని ప్రాథమిక పాఠశాల వద్దే ఇది జరగడం విశేషం. శివాజీపాలెంలోని హోం మంత్రి ఇంటికి సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద పెద్ద సంఖ్యలో మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. చిన్నారులు చదువుకునే పాఠశాలను అడ్డాగా చేసుకుని ఆగడాలు సృష్టిస్తున్న మందుబాబులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలు రేపు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా యూనిట్ ఎన్నికలు బుధవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేజీహెచ్‌లోని యూనియన్ బ్యాంకు సమీపంలోని నర్సుల క్లాక్ రూమ్‌లో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఓటరూ తప్పకుండా గుర్తింపు కార్డుతో పాటు ఒరిజినల్ ఆధార్ కార్డు లేక ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, టెంట్లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు.

ఏయూను సందర్శించిన జీఎంఆర్ ఫౌండేషన్ డైరెక్టర్


ఏయూ వీసీ శశిభూషణరావును కలిసిన జీఎంఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత రాజు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ స్మిత రాజు సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో భేటీ అయ్యారు. యువతలో నైపుణ్యాలను పెంపొందిస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే కోర్సుల రూపకల్పన దిశగా చర్చించారు. డ్యూయల్ డిగ్రీ విధానాన్ని ఏయూలో అమలు చేస్తున్నామని, దాని ప్రాధాన్యం, యువతకు లాభదాయకంగా నిలచే విధానం తదితర అంశాలను వీసీ వివరించారు. దేశంలో మేధో వలసలు తగ్గించడానికి డ్యూయల్ డిగ్రీ ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఏయూలో ఏర్పాటవుతున్న డ్రగ్ టెస్టింగ్, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల పనితీరు, విద్యార్థులను వీటిలో భాగస్వాములను చేస్తూ పరిశ్రమలతో అనుసంధానించేలా కృషి చేస్తున్న విధానాన్ని వివరించారు. విద్యార్థుల్లో మల్టీ డిసిప్లినరీ స్కిల్స్ అభివృద్ధికి చేపడుతున్న చర్యలను తెలియజేశారు. ఏవియేషన్ రంగానికి ఉపయుక్తంగా నిలిచే కోర్సులపై విస్తృతంగా చర్చించారు. ఏయూలో విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్ లభిస్తున్న విధానం వివరించారు. నూతన కోర్సుల రూపకల్పనకు దిశానిర్దేశం చేశారు. ఏయూలో ఏర్పాటు చేసిన ఆ హబ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మైటీ సీవోఈలను స్మిత సందర్శించారు. ప్రస్తుతం ఉన్న కోర్సులకు భిన్నంగా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను రూపకల్పన చేయడంలో ఏయూ సహకారం అందించాలని ఆమె కోరారు. సంపూర్ణ సహకారం అందిస్తామని వీసీ తెలిపారు. అనంతరం స్మిత రాజును వీసీ సత్కరించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరప్ప, పూజ విద్యశంకర్, ప్లేస్‌మెంట్ అధికారులు డాక్టర్ చల్ల నరసింహం, వి.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం


పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న సమయం హేమంత్‌కుమార్ తదితరులు

ఏయూక్యాంపస్: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పునరంకితమై పనిచేస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోలీస్ మెస్ వద్ద ఉన్న స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సమస్యలను పరిష్కరించి, బకాయిలను చెల్లించాలన్నారు. 2023లో జరిగిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు గ్రేస్ మార్కులు వేసి తదుపరి పరీక్షలు నిర్వహించాలని, హోం గార్డులను ప్రభుత్వ శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

అత్యవసర సేవల విభాగం గేట్ల మూసివేత


చెస్ట్ ఆస్పత్రిలో మూసి ఉన్న అత్యవసర విభాగం గేట్లు



మానసిక ఆస్పత్రిలో మూసి ఉన్న అత్యవసర విభాగం గేట్లు

బీచ్‌రోడ్డు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు వెంటనే వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రుల్లో అత్యవసర విభాగం ఏర్పాటు చేస్తారు. అయితే పెదవాల్తేరులోని చెస్ట్ ఆస్పత్రి, మానసిక ఆస్పత్రి అత్యవసర విభాగాల గేట్లు మూసి ఉండటం గమనార్హం. ప్రత్యేకించి ఛాతీ నొప్పి వంటి అత్యవసర పరిస్థితుల్లో చెస్ట్ ఆస్పత్రి అత్యవసర విభాగం గేట్లు మూసి ఉండటం రోగులను ఆందోళనకు గురి చేస్తోంది. ఛాతీ నొప్పి తీవ్రతను తట్టుకోవడం కష్టం. అలాంటి సమయంలో క్షణం కూడా చాలా విలువైనది. సరైన సేవలు లభించకపోతే రోగుల ఆరోగ్యం క్షీణించే ప్రమాదం ఉంది. అందుకే అత్యవసర విభాగాల గేట్లు ఎల్లప్పుడూ తెరిచి ఉంచాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

శిథిలావస్థలో తెన్నేటి పార్కు మెట్లమార్గం


తెన్నేటి పార్కు నుంచి బీచ్‌కు వెళ్లే మార్గంలో శిథిలమైన మెట్లు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కు నుంచి బీచ్‌కు వెళ్లే మెట్ల మార్గం శిథిలమైంది. ఈ పార్కు నుంచి బీచ్ వైపు దిగడానికి వీలుగా గతంలో వీఎంఆర్‌డీఏ మెట్ల మార్గం నిర్మించింది. వాటిపై నుంచి బీచ్‌లోకి సందర్శకులు దిగుతుంటారు. ఈ మెట్ల పక్కనే పిల్లలు సరదాగా కిందకు దిగడానికి ఆర్చ్ ఆకారంలో జారుడు బల్ల ఏర్పాటు చేశారు. ఈ మెట్ల మార్గంలో దిగడానికి పిల్లలు ఆసక్తి చూపేవారు. ఇప్పుడు ఈ మెట్లు శిథిలమయ్యాయి. దీంతో పిల్లలు వాటిని వినియోగించడానికి వీలుపడటం లేదు. మెట్లకు ఇరుపక్కలా చిన్న ఎత్తులో ఉన్న రక్షణ గోడలు విరిగిపోయాయి. జారుడు బల్లలాంటి భాగం శిథిలమైంది. వీఎంఆర్‌డీఏ అధికారులు ఈ పార్కును ఇటీవల ఆధునికీకరించి.. మెట్లను మాత్రం మరిచిపోయారు. పిల్లల కోసం మెట్ల మార్గాన్ని పునర్నిర్మించాలని సందర్శకులు కోరుతున్నారు.

పర్యావరణ హితంగా దీపావళి

ఎంవీపీకాలనీ: పర్యావరణ హిత దీపావళి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీలోని పలు పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీపావళి రోజు వినియోగిస్తున్న మందుగుండు సామగ్రి ద్వారా వాతావరణానికి జరుగుతున్న నష్టాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో పర్యావరణ హితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దీపావళి జరుపుకోవాలని సూచించారు. ఈ దిశగా ప్రతి ఇంట్లో అవగాహన పెంచాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలియోపై అప్రమత్తం


మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌కుమార్

బీచ్‌రోడ్డు: మేఘాలయలో ఇటీవల బయటపడిన పోలియో కేసు నేపథ్యంలో పోలియోమైలిటిస్ వల్ల కలిగే నిరంతర ముప్పును గుర్తించడం చాలా అవసరమని నియోనాటాలజిస్ట్ డాక్టర్ పి.సతీష్ కుమార్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో ఒక తీవ్రమైన వైరల్ అంటువ్యాధని, ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. పోలియో రహిత భారత్ వంటి దేశాల్లో ఇది మళ్లీ రాకుండా నివారించడానికి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌యాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్(ఐపీవీ) పిల్లలను రక్షించడానికి సాధనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోలియో నివారణకు ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అడ్వైజరీ కమిటీ ఆన్ వ్యాక్సిన్స్ అండ్ ఇమ్యునైజేషన్ సిఫార్సు చేసిన టీకా షెడ్యూల్‌ను కచ్చితంగా అనుసరించాల్సిన అవసరముందన్నారు. పోలియో వ్యాక్సిన్ బూస్టర్‌లు వేయించటం ద్వారా చిన్నారులను సురక్షితంగా కాపాడవచ్చని సూచించారు.

జోన్ - 3 ఏపీడీగా రాము

సీతమ్మధార: జీవీఎంసీ జోన్ - 3 యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎల్.రాము నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆశీలమెట్ట జోనల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ గాజువాక యూసీడీ ఏపీడీగా పనిచేస్తూ జోన్ - 3కి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏపీడీగా పనిచేసిన దుర్గాప్రసాద్ గాజువాకకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఏపీడీ రాము మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌జీఎఫ్ ఎంపికల షెడ్యూల్‌లో మార్పులు

అగనంపూడి: సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్–2 (ఎఫ్ఏ–2) పరీక్షల వాయిదా కారణంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా ఎంపికలను రీ షెడ్యూల్ చేసినట్టు ఎస్‌జీఎఫ్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు వి.దేముడు, ఎం.వి.నాగేశ్వరరావు, వి.కొండబాబు తెలిపారు. ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించాల్సిన ఎఫ్ఏ–2 పరీక్షలను వచ్చేనెల 4 నుంచి 6వ తేదీలకు రీషెడ్యూల్ చేసిన నేపథ్యంలో క్రీడా ఎంపికలు కూడా రీ షెడ్యూల్ చేసినట్టు పేర్కొన్నారు. 23న హాకీ ఎంపికలు అండర్–14 బాలురు, బాలికలకు నక్కపల్లి హైస్కూల్‌లో, 24న బేస్ బాల్, రోప్ స్కిప్పింగ్ ఎంపికలు అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో అనకాపల్లిలోని జీఎంపీఎస్ పాఠశాలలో, టెన్నీకాయిట్ ఎంపికలు అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్‌లో, 25న వాలీబాల్ ఎంపికలు అండర్–14 బాలురు, బాలికల విభాగంలో ఎ.ఎల్.పురం (కెడీపేట మండలం)లో, 26న యోగాసన ఎంపికలు నక్కపల్లి మండలం వేంపాడు జెడ్పీ హైస్కూల్‌లో, 29న త్రోబాల్ అండర్ 14, 17 బాలురు, బాలికల విభాగంలో హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బహిరంగ మద్యపాన నిషేధంపై అవగాహన

సాక్షి ఎఫెక్ట్..


పెదజాలరిపేట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళీ

ఎంవీపీకాలనీ: పెదజాలరిపేట తీరంలో బహిరంగ మద్యపాన నిషేధంపై ఎంవీపీ పోలీసులు అవగాహన కల్పించారు. పెదజాలరిపేట తీరం వెంబడి మందుబాబుల ఆగడాలపై 'పేట్రేగిపోతున్న మందుబాబులు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఎంవీపీ పోలీసులు స్పందించి ఆ ప్రాంతంలో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. తీరంలో మద్యం తాగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామ పెద్దలతో పాటు యువతకు సీఐ మురళీ వివరించారు. ఆ మేరకు గ్రామస్తుల్లో అవగాహన పెంచేందుకు దండోరా వేయించాలని సూచించారు. బయట వ్యక్తులు ఎవరూ ఇక్కడికి వచ్చి మద్యం తాగకుండా చూసుకోవాలన్నారు. శ్మశానవాటిక, లాసన్స్ బే పార్కుల పరిధిలో సైతం తీరం వెంబడి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి తీరంలో నెలకొన్న పరిస్థితులను నగర పోలీస్ ఉన్నతాధికారులకు వివరించామని చెప్పారు. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు నిరంతరం పోలీస్ బృందాల పికెట్ అవసరముందన్న ఆయన ఇందుకు అనుగుణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!





జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని రహదారులపై ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో సతమతమవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. - బీచ్‌రోడ్డు



